క్లుప్తంగా

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సభ్యులు

కడప అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయులు, వృద్ధులకు ఆదివారం అన్న ప్రసాదం అందజేశారు. నబీకోటకు చెందిన తన్మయి వెల్‌నెస్ వరల్డ్ అధినేత మడితాటి వీర బ్రహ్మయ్య, తల్లిదండ్రులు రాజేశ్వరి, కృష్ణమాచారి, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గుండ్లకొండ విజయలక్ష్మి, గుండ్లకొండరవి, రెడ్డిలక్ష్మణ్, వెంకటసురేష్‌బాబు, చంద్రమౌళి, గుండ్లకొండ చరణ్, దామోదర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు సామూహిక నిరాహార దీక్ష

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకటశివ కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు, పట్టణాల్లో వారికి రెండు సెంట్ల ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల్లో వినతులకు దుమ్ము పడుతుందేగానీ వాటిపై విచారణ జరగలేదన్నారు. సరోజినీనగర్, చలమారెడ్డిపల్లె వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ రూపాయి ఖర్చు చేయలేదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న లోపభూయిష్టమైన విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహారదీక్ష చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన

కడప రూరల్: మెరుగైన ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీరంగ ఆస్పత్రి డాక్టర్ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ రంగప్రసాద్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అనారోగ్య లక్షణాలు ఉన్నపుడు వైద్యులను సంప్రదించాలన్నారు. ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని చెన్నూరుకు చెందిన పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ఆంజనేయపురం గ్రామంలో జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ పండగ, ఇతర వేడుకలకు రక్తదానం చేసే సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్తే రక్త కొరత నివారించవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళావతి, కార్తీక్‌రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, వెంకటరమణ, మానికరెడ్డి, జగదీశ్ రెడ్డి, పోలయ్య, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

అతి పెద్ద పార్టీ బీజేపీ



మాట్లాడుతున్న వెంకట సుబ్బారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, బీరం సుబ్బారెడ్డి, బత్తల పవన్‌కుమార్, సురేంద్ర, ప్రవీణ్‌నాయుడు, పద్మావతీభాయి, షకీలా బేగం, ఓబులయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటివరకూ నమోదు చేసుకోని ప్లాట్ ఫాం కార్మికుల కోసం ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేది వరకు ప్రత్యేక నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కార్మికశాఖ జిల్లా అధికారి శ్రీకాంత్ నాయక్ తెలిపారు. ఈ శిబిరాల్లో తమ పేర్లు తప్పక రిజిష్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు హెల్ప్ డెస్క్ నెంబరు 94925 55201లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రామయ్యా... ఇదిగోనయ్యా సీతమ్మ



భాగ్యనగర్ కాలనీ కోదండ రామాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం



హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండరామాలయంలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

అడుగడుగో రాముడు....నీలమేఘ శ్యాముడు, ఆ దశరథరాముడు కల్యాణమూర్తిగా వేదికపై పెళ్లి పీటపై కొలువుదీరాడు. ఆ ప్రక్కనే సౌందర్యరాశి ఆదర్శమూర్తి సీతమ్మ పెళ్లి పీటపై ఒదిగి ఒదిగి కూర్చొన్నారు. ఆ ఆదర్శ మూర్తుల కల్యాణోత్సవ నిర్వహణలో ఆ ప్రాంతం కొత్త కళను సంతరించుకుంది.. భక్తుల రామ నామస్మరణ మధ్య సీతారాముల కల్యాణ వైభోగం అంగరంగ వైభవంగా జరిగింది.

వైభవంగా సీతారాముల కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండరామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్ల మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ వస్త్రాలతో అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో అర్చకుల బృందం కల్యాణ క్రతువు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. ఉభయదారులే పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కన్యాదానం చేశారు. మహా మంగళ సూత్రానికి శోడషోపచారాలు చేసి భక్తులచే దర్శింపజేశారు. మంగళ వాయిద్యాల మధ్య వేదపండితుల మంత్రోచ్చటన మధ్య అర్చకస్వాములే స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మంగళసూత్రాలను అలంకరించారు. అనంతరం ఉత్సాహ భరితంగా అక్షతారోపణ కార్యక్రమం నిర్వహించారు. అందులో వాడిన ముత్యాల తలంబ్రాలను భక్తులందరికీ కల్యాణోత్సవ ప్రసాదంగా పంచి పెట్టారు. వీటి కోసం భక్తులు పోటీలు పడ్డారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి బృందం పర్యవేక్షణలో గాయకులు భక్తిగీతాలు ఆలపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులందరికీ నిర్వాహకులు కల్యాణ విందు ఏర్పాటుచేశారు. క్రమాలు కొనసాగాయి.

డీఎఫ్‌ఓ కార్యాలయంలో

కడప అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా అటవీ శాఖ జిల్లా అధికారి వినీత్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో కడప డీఎఫ్‌ఓ కార్యాలయం ఆవరణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, సతీమణి రూపక్‌తో కలిసి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాంగల్యదర్శనం చేయిస్తున్న అర్చకుడు

శిల్పారామంలో

కడప కల్చరల్: కడప శిల్పారామంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుక స్థానిక చిన్నారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. తొలుత శిల్పారామానికి విచ్చేసిన సందర్శకులందరికీ పానకం, వడపప్పు పంచి పెట్టారు. స్థానిక స్ప్రౌట్ వాలీ ఇంటర్నేషనల్ స్కూల్ చిన్నారులు సాంస్కృతిక కళా వేదికపై సంప్రదాయ దుస్తులతో ముచ్చటగా నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.

భక్తులకు అన్నదానం

కడప కార్పొరేషన్: శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని సంధ్యా సర్కిల్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వాహకులు మహిమలూరి వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజుల రెడ్డి వడపప్పు, పానకం పంపిణీ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహా విష్ణువు ఏడో అవతారమైన శ్రీరాముడు మహా పరాక్రమవంతుడని, ఎంతో క్షమాగుణం గలవాడన్నారు. పెద్దలపట్ల, కుటుంబం పట్ల గౌరవం కలగవాడని, మంచితనానికి శ్రీరాముడు పర్యాయ పదమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మహిమలూరి లోకేష్, నాగేంద్ర, జి.శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన భక్తజనం

కడప కల్చరల్ నగరంలోని అన్ని రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కల్యాణోత్సవం, విశేష పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి కల్యాణ కార్యక్రమాలు ప్రారంభించి మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల్లోపుగా ముగించారు. అన్ని ఆలయాల వద్ద భక్త జనం పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. నాగరాజుపేట బేల్దారివీధి కోదండ రామాలయం, నెహ్రూనగర్‌లోని రామాలయంలో స్థానిక భక్తుల కమిటీలు, ధర్మకర్తల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామివీధి, నాగరాజుపేట, సింహపురికాలనీ, శారదానిలయం హైస్కూల్, అరవిందనగర్, మారుతీ నగర్, రవీంద్ర నగర్, భాగ్యనగర్, శంకరాపురం, హబీబుల్లా వీధిలోని రామాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి కల్యాణోత్సవాలు ఘనంగా జరిపారు. అనంతరం ఆలయాల వద్ద అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భవనాశి సుధాకర్, ప్రభాకర్, నారాయణ, సురేంద్రనాథ్, మునగా శ్రీనివాసకుమార్, మార్రెళ్ల రఘు పాల్గొన్నారు.

పానకం, వడపప్పు పంపిణీ

శ్రీరామ నవమి సంప్రదాయాల్లో భాగంగా ఆదివారం పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు, ధార్మికవేత్తలు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఏడు రోడ్ల కూడలిలో పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్ రెడ్డి, సరస్వతమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తొలుత శ్రీరాముల చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. రాజీవ్‌మార్గ్‌లో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినిలు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకులు లెక్కల కొండారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



ప్రసాదం పంచుతున్న డీఎఫ్‌ఓ దంపతులు



ఎమ్మెల్యే మాధవీరెడ్డి దంపతుల పూజలు



రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో వడపప్పు పంపిణీ



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పూలదండల మార్పిడి ఉత్సవంలో భక్తులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని ఆయన స్వగృహంలో ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.గునిశెట్టి శ్రీనివాసులు, అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, తదితరులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు. జీవో 117 రద్దు నేపథ్యంలో ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లకుండా, పాఠశాలలు మూతపడకుండా చూడాలని ఉపాధ్యాయులు కోరారు. అనంతరం ఆర్‌జేయూపీ నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ కమీషన్ ఏర్పాటు, కరువు భత్యం విడుదల, పెండింగ్ అరియర్స్ విడుదల చేయాలని కోరారు. కేజీబీవీ పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ద్వారా 2024 నవంబరులో నియమించిన వంట మనుషులు, హెల్పర్స్, వాచ్‌మెన్లు, స్వీపర్స్‌కు జీతాలు చెల్లించాలన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తెలిపారు. సమావేశంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వీరయ్య, కృష్ణారెడ్డి, వీరన్న, రాజశేఖర్‌రెడ్డి, సంజీవప్ప, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాయకులు

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్య సాధనకు కష్టపడి చదివాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్య పేర్కొన్నారు. కడప నగర శివారులోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో టెక్నాలజీ విద్య ఎంతో అవసరం అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవడంతోపాటు కళాశాలకు మంచిపేరు తేవాలన్నారు. కళాశాల చైర్మెన్ బి.శ్రీనివాసులు(డింబర్ డిపో శ్రీనివాసులు) మాట్లాడుతూ విద్యార్థుల అభ్యుదయమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రయ్య

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

కడప కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా అన్నారు. ఎంబీసీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేదరికం, కరువు, విద్య, వైద్యం, ఉపాధి సమస్యలు పట్టించుకోకుండా, ముస్లింలపై నిబంధనలు, చట్టాలు తెచ్చి ఇబ్బందులకు గురిచేయడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. దేశంలోని తొమ్మిది కార్పొరేట్ సంస్థలకు వక్ఫ్ భూములు అప్పగించాలనే ఈ బిల్లు తెచ్చారన్నారు. ముస్లిం, మైనార్టీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన పార్టీలు ఈ బిల్లుకు మద్దతు తెలపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాల పెద్దన్న, ప్రచార కార్యదర్శి ఎస్. కుళ్లాయప్ప, జిల్లా కార్యదర్శి రెడ్డెయ్య, దస్తగిరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

వైద్య విద్యార్థినికి లైంగిక వేధింపులు

కడప అర్బన్: తనను లైంగికంగా వేధిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని ఓ వైద్య విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న విద్యార్థిని తమ కళాశాకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ తన సెల్‌ఫోన్‌కు అసభ్యకర పోస్టింగ్‌లు పంపిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. తాను ఎన్నిసార్లు బతిమలాడినా వినకుండా మార్ఫింగ్ చేసి ఫొటోలను పంపిస్తున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. వేంపల్లిలో నివాసం ఉంటూ ఏఎస్‌ఆర్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ వైద్యకళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సదరు వైద్యుడిని చిన్నచౌక్ పోలీసులు ఎట్టకేలకు శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చినట్లు సమాచారం. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

బాలుడి గల్లంతు

కడప అర్బన్: కడప నగరంలోని నకాష్‌కు చెందిన సయ్యద్ జాకీర్ కుమారుడు సయ్యద్ సమీర్ (17) కడప నగర శివార్లలోని వాటర్‌గండిలో ఈత కోసం వెళ్లి గల్లంతైనట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీతారాముల కల్యాణ వైభోగమే

చింతకొమ్మదిన్నె: మండలంలోని ఆలయాలలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం వేడుకలు నిర్వహించుకున్నారు. ఇప్పపెంట, మూలవంక, బుగ్గలేటిపల్లి, ఊటుకూరు, చింతకొమ్మదిన్నె తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు.

కమలాపురం : మండల ప్రజలు శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం కమలాపురంతో పాటు కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, సంబటూరు తదితర గ్రామాల్లో నవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు.



మూలవంక గ్రామంలో సీతారాముల కల్యాణం

బీమా కోసం కార్మికుల ఎదురుచూపులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబీకులు బీమా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హొచిమిన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలిచేందుకు చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు నిర్వహించి సేఫ్టీ పరికరాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటియూసీ జిల్లా కార్యదర్శి లింగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసీ బాదుల్లా

బ్రహ్మోత్సవాల్లో రుచికరమైన అన్న ప్రసాదాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే వేలాదిమంది భక్తులకు నిరంతరాయంగా రుచికరమైన అన్న ప్రసాదాలను టీటీడీ అందిస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ అందిస్తునారు. ఆలయ ప్రాంగణంలో ఎండవేడిమి భక్తులకు ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిరోజూ ఉదయం 7.30 గంటలకు అల్పాహారం , ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు రుచికరమైన అన్నం, సాంబారు, రసం, మజ్జిగ, పచ్చడి, కర్రీ, బెల్లం, పొంగళి అందిస్తారు.



అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న సిబ్బంది

వడపప్పు, పానకం పంపిణీ

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో శ్రీవారి సేవకులు ద్వారా ఆదివారం ఉదయం నుంచి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. దక్షిణ భారతదేశంలోని రామాలయాలలో శ్రీరామ నవమి సమయంలో శ్రీరాముడికి పానకం , వడపప్పు నైవేద్యంగా సమర్పించిన తరువాత భక్తులకు అందించారు.

సంధ్యా సమయాన... భానుడి రూపం



మండలంలోని సందర్శనీయ ప్రాంతమైన ఒంటిమిట్టలో శనివారం సూర్యోదయం సందర్శకులను ఆకట్టుకుంది. సాయం సంధ్యా సమయంలో కొండల మధ్య అస్తమిస్తున్న భానుడి కిరణాలు ఇలా చెరువుపై పడ్డాయి. దీంతో పర్యాటకులు చూడముచ్చటగా ఉన్న ఈ దృశ్యం తిలకించేందుకు ఆసక్తి చూపారు.

– రమేష్ తీట్ల, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

రాబోయేది.. విసనకర్రల కాలమే



వేసవిలో చల్లదనం కోసం నానావస్థ పడుతున్న ప్రజలకు విసనకర్రల అవసరం వచ్చింది మరి. ఉదయం, సాయంత్రం విద్యుత్తు సరఫరాలో కోతలు ఉండడంతో పేదలు విసనకర్రలతో సేద తీరుతున్నారు. వీటికి ఆదరణ పెరగడంతో మార్కెట్‌లో నాలుగు నుంచి అయిదు రకాల విసన కర్రలు వ్యాపారులు అందుబాటులో ఉంచారు. దేవుని కడప రోడ్డు బీకేఎం స్ట్రీట్ వద్ద విసన కర్ర అమ్ముతున్న దృశ్యాలు సాక్షి కెమెరాకు చిక్కాయి.

– రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్